

బురద రోడ్డు వద్ద ఆగిన అంబులెన్స్

## రోడ్డు ఇలా.. అంబులెన్స్ వెళ్లేదెలా?

**మృతదేహం తరలింపులో ఇబ్బందులు**

మంగపేట, జూలై 25 : ములుగు జిల్లా మంగపేట మండలంలోని కొత్త చీపురు దుబ్బ గ్రామానికి చెందిన సోడే సూరయ్య అనారోగ్యంతో ఏటూరునాగారం సామాజిక వైద్యశాలలో గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి అంబులెన్స్‌లో తీసుకొస్తుండగా గ్రామ ప్రారంభంలో బురద రోడ్డుతో తరలింపు ఇబ్బందిగా మారింది. అంబులెన్స్ అందులోనుంచి వెళ్లలేని పరిస్థితి ఉండడంతో గ్రామస్తులు, బంధువులు చెట్ల కొమ్మలు వేసి దాటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతో అధికారులు మట్టి పోశారు. దీంతో అది బురదమయమవడంతో కనీసం నడవలేని పరిస్థితి నెలకొందని, వెంటనే మరమ్మతులు చేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## సర్కారు స్కూల్లో క్లీనింగ్ పనులు విద్యార్థులతోనే..

**బాత్‌రూంలు శుభ్రం చేయించడంపై స్థానికుల ఆగ్రహం**

బయ్యారం, జూలై 25 : గంధంపల్లి మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయిస్తుండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ విద్యార్థి గురువారం ఉదయం పాఠశాల ఆవరణలోని బాత్‌రూంలో నీటి పైపుతో శుభ్రం చేస్తుండడంతో గమనించిన స్థానికులు విద్యార్థితో పనులు చేయించడం ఏమిటని టీ చర్లను ప్రశ్నించారు. తమ పిల్లలు కూడా అదే పాఠశాలలో చదువుతున్నారని, ప్రతి రోజూ విద్యార్థులతో బాత్‌రూంలు శుభ్రం చేయిస్తున్నారని, చదువు సరిగా చెప్పడం లేదని మండిపడ్డారు. ఈ విషయంపై స్థానిక ఎంఈవో పూల్‌చంద్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని తెలిపారు.



బాత్‌రూంను శుభ్రం చేస్తున్న విద్యార్థి

## దారికాచిన మృత్యువు..



జహంగీర్ (ఫైల్)



చెట్టు కూలి మృతి చెందిన జహంగీర్

ఏటూరునాగారం, జూలై 25: ఏటూరునాగారం-చిన్నబోయినపల్లి జాతీయ రహదారిపై గురువారం చెట్టు కూలి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నబోయినపల్లికి చెందిన సయ్యద్, మహబూబీల కుమారుడు జహంగీర్(30) గ్రామంలో మెడికల్ షాపు నడుపుతున్నాడు. దుకాణానికి అవసరమైన మందులను తెచ్చుకునేందుకు బైక్‌పై ఏటూరునాగారానికి వెళ్తున్న క్రమంలో రోడ్డుపై అకస్మాత్తుగా చెట్టు కూలింది. దీంతో జహంగీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగి పడడంతో ఎస్సై తాజుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. తమ కుమారుడు మృతి చెందిన ఘటనను తెలుసుకుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, జహంగీర్‌కు ఏప్రిల్‌లో వివాహం నిశ్చయం కాగా, సెప్టెంబర్‌లో పెళ్లి జరగాల్సి ఉంది.

# సురక్షిత ప్రాంతానికి తరలించాలి

- లేకుంటే ఓసీపీ నుంచి బొగ్గు పెల్ల బయటకు పోనివ్వం
- తాడిచెర్ల భూ నిర్వాసితుల హెచ్చరిక

మల్హార్, జూలై 25 : నెల రోజుల్లో తమ ఇండ్లకు తిరిగి ప్రిలిమినరీ నోటిఫికేషన్ కాల పరిమితి పెంచి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇవ్వాలని, లేకుంటే తాడిచెర్ల ఓసీపీ నుంచి బొగ్గు పెల్ల కూడా బయటకు పోనివ్వమని భూ నిర్వాసితులు స్పష్టం చేశారు. గురువారం భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. సంఘం ప్రధాన కార్యదర్శి అక్కపాక సమ్మయ్య మాట్లాడుతూ తాడిచెర్ల ఓసీపీ-1 గనికి 500 మీటర్ల డేంజర్ జోన్‌లో ఉన్న 2,800 ఇండ్లను తీసుకొని పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తూ సురక్షిత ప్రాంతానికి తరలించాలని గత ఫిబ్రవరిలో చేపట్టిన ధర్నాకు కేటీపీఎస్ చీఫ్ ఇంజినీరు సిద్ధయ్య నాలుగు నెలల్లో పరిహారం ఇవ్వడంతో పాటు పునరావాసానికి తరలిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని, పైగా ఓసీపీలో బాంబు పేలుళ్లతో ఇండ్లు కూలిపోవడమే కాకుండా ఫ్యాక్టరీ నుంచి వచ్చే రసాయనాలతో అనారోగ్యాల బారిన పడుతున్నామన్నారు. ఈ విషయమై జెన్‌కో అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు.



నిరసన తెలుపుతున్న తాడిచెర్ల ఓసీపీ భూ నిర్వాసితుల సంఘం నాయకులు

ఆగస్టు 31లోగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేదంటే జాతీయ రహదారి-364 దిగ్బంధించడంతో పాటు కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అప్పటికీ న్యాయం జరగకపోతే ఓసీపీని ముట్టడించి ఉత్పత్తిని నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో తాండ్ర మల్లేశ్, ఆంజనేయులు, బొబ్బిలి రాజయ్య, సారంగం, సందీప్, పీరయ్య పాల్గొన్నారు.

# ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

- బాలికల సింగిల్స్‌లో ఫైనల్స్‌కు కీర్తి, అక్షయచౌదరి
- మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆదిత్య, రిషిత
- బాలుర సింగిల్స్‌లో శశాంక్, డబుల్స్‌లో ధృవ్‌పర్షద్

హనుమకొండ చౌరస్తా, జూలై 25 : రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో గురువారం జరిగిన పోటీల్లో బాలికల డబుల్స్ విభాగంలో లక్ష్మీ రిథిమా-సరయూ (హైదరాబాద్), రిషికనాయుడు-హన్సిక (రంగారెడ్డి), సమీక్షారెడ్డి-ప్రజ్వల నిసర్గ (హైదరాబాద్), అనుసంజన మురళి-శృతిగ్రేస్‌రెడ్డి (రంగారెడ్డి) సెమీస్‌కు చేరినట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్‌కుమార్, రమేశ్‌రెడ్డి తెలిపారు. బాలికల సింగిల్స్ విభాగంలో కీర్తి మంచాల (వరంగల్)- హన్సిని (రంగారెడ్డి)పై, అక్షయచౌదరి (మెదక్)-అనినిరెడ్డి (రంగారెడ్డి)పై, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఆదిత్య హర్షవర్ధన్-రిషిత పాండే(రంగారెడ్డి) సాయినట్‌కేశ్-మాడ్గుల పూజిత (వరంగల్)పై, బాలుర సింగిల్స్ విభాగంలో శశాంక్ వనమాల(రంగారెడ్డి)-అలీసిద్ధిక్ (వరంగల్)పై, బాలుర డబుల్స్ విభాగంలో ధృవ్ పర్షద్-వివేక్(రంగారెడ్డి) అద్వైత్‌రెడ్డి-శ్రీవర్ధన్‌గౌడ్(మెదక్)పై విజయం సాధించారు. పోటీలను జిల్లా అసోసియేషన్ ట్రెజరర్ నాగకిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జితేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

# తరలించిన ధాన్యం సంగతేంది?

- చర్చనీయాంశంగా సివిల్ సప్లయ్, రైస్‌మిల్లర్ల వ్యవహారం
- సీఎంఆర్ అక్రమాలపై ఉన్నతాధికారుల మౌనం

ములుగు, జూలై 25 (నమస్తే తెలంగాణ) : సీఎంఆర్ రికవరీ పేరిట ములుగు జిల్లా కేంద్రంలోని సాయి సహస్ర రైస్ మిల్లు నుంచి తరలించిన ధాన్యం సంగతేమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు. హైకోర్టు ఆదేశాలతో సివిల్ సప్లయ్ అధికారులు రైస్ మిల్లును 'ఉన్నది ఉన్నట్లుగా' సీజ్ చేశారు. కానీ, అప్పటికే తరలించిన ధాన్యం విషయమై వెల్లడించడం లేదు. నిబంధనలు అతిక్రమించి రైస్ మిల్లర్స్ యూనియన్ నాయకులకు లాభం చేకూర్చేలా వ్యవహరించిన సివిల్ సప్లయ్ అధికారుల అంశం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారికి చెందిన మిల్లులతో పాటు మరో మూడింటికి 3 వేల క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ సన్న బియ్యం, మరో 3 వేల క్వింటాళ్ల ధాన్యం తరలించినట్లు సాయి సహస్ర మిల్లు నిర్వాహకులు చెపుతున్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం తరలించిన బియ్యంతో పాటు ధాన్యాన్ని ఏం చేస్తారనేది తెలియడం లేదని, వాటిని దుర్వినియోగం చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ డీఎంను వివరణ కోరగా కోర్టు స్టేటస్‌కో ఉన్నందున వివరాలను ఆగస్టు 2 తర్వాత తెలియజేస్తామన్నారు. కాగా, సీఎంఆర్ అక్రమార్కులపై చర్యల విషయంలో ఉన్నతాధికారులు మౌనం పాటిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని, అవకతవకలకు పాల్పడిన రైస్ మిల్లరతో పాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




**బస్సుల్లో ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ప్రమాదకర ప్రయాణం**

టేకుమట్ల నుంచి గిద్దెముత్తారం వెళ్లే బస్సులో గురువారం ప్రయాణికులతోపాటు, కాలేజీ విద్యార్థులు ఇలా కిక్కిరిసిపోయి ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణించారు. మళ్లీ రాత్రి 8 గంటల వరకు బస్సు లేదని, దీంతో తప్పనిసరిగా ప్రయాణం చేయాల్సి వస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. బస్సుల సంఖ్యను పెంచి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – టేకుమట్ల, జూలై 25

## వైద్యశాలల్లో వ్యాక్సిన్ కొరత

**ఆందోళన చెందుతున్న చిన్నారుల తల్లిదండ్రులు**

ఏటూరునాగారం, జూలై 25 : ప్రభుత్వ వైద్యశాలల్లో చిన్న పిల్లల వ్యాక్సిన్‌కు కొరత ఏర్పడింది. ప్రతి బుధవారం, శనివారం ఆరోగ్య కేంద్రాలు, దవాఖానల్లో గత మూడు వారాలుగా వ్యాక్సిన్ వేయకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చిన్న పిల్లలకు ప్రధానంగా 6, 10, 14 వారాల్లో వేయాల్సిన వ్యాక్సిన్ ప్రస్తుతం అందుబాటులో లేనట్లు తెలుస్తున్నది. అలాగే తొమ్మిది, 16 నెలలకు వేసే వ్యాక్సిన్‌కూ కొరత ఉన్నట్లు సమాచారం. టీడీ, పెంటా వాలెంట్, రోటా వైరస్ వ్యాక్సిన్, బీసీజీ, పోలియో, ఇతర వ్యాక్సిన్‌ను ఆయా గడువును బట్టి ఇవ్వాల్సి ఉంటుంది. వీటి కోసం పిల్లల తల్లిదండ్రులు ఆయా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో అప్పయ్యను వివరణ కోరగా వ్యాక్సిన్ సరఫరా కాకపోవడంతో కొంచెం జాప్యం జరిగిందని, శనివారం నుంచి అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



బుద్ధారం గ్రామంలో శిథిలమై ఉన్న అశోక్ ఇల్లు



అశోక్ (ఫైల్)

## తండ్రి సంవత్సరీకం రోజునే..

- ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత అశోక్ మృతి
- భద్రాద్రి, ములుగు జిల్లాల సరిహద్దులో ఘటన
- గణపురం మండలం బుద్దారంలో విషాదం

గణపురం, జూలై 25: తండ్రి సంవత్సరీకం రోజునే భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కొడుకు నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందాడు. దీంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారంలో విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన నల్లమారి వీరస్వామి-రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురున్నారు. రెండో కుమారుడు అశోక్ 7వ తరగతి వరకు చదువుకొని వ్యాన్ డ్రైవర్‌గా పనిచేశాడు. కొద్దిరోజుల తర్వాత న్యూడెమోక్రసీ పార్టీలో చేరగా, 2017లో పోలీసులకు దొరికి కొంతకాలం జైలు జీవితం గడిపాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మావోయిస్టు పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లాడు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దామరతోగు అడవుల్లో గురువారం ఉదయం స్పెషల్ పార్టీ పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో అశోక్ మృతి చెందాడు. కాగా, అశోక్ తల్లి 20 ఏళ్ల క్రితం చనిపోగా, తండ్రి గతేడాది మృతి చెందాడు. తండ్రి సంవత్సరీకం గురువారం ఉండగా, అదే రోజు అశోక్ ఎన్‌కౌంటర్ జరిగింది.

# రియల్ పన్ను పోటు




**స్థిరాస్తి క్రయవిక్రయాలకు దెబ్బ • బడ్జెట్‌లో ఇండెక్సేషన్ బెనిఫిట్ దూరం**

**పెరిగిన ఎల్‌టీసీజీ పన్ను భారం • నిర్మాణ రంగానికి నష్టమేనంటున్న నిపుణులు**

***మధ్యతరగతి సొంతింటి కలల్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్ చెరిపేసింది. ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించి మోయలేనంత పన్ను భారాన్ని మోదీ సర్కారు మోపింది మరి. స్థిరాస్తి క్రయవిక్రయాలను ఆందోళనకరం చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయంపట్ల నిర్మాణ రంగ పరిశ్రమ భగ్గుమంటున్నదిప్పుడు.***

న్యూఢిల్లీ, జూలై 25: కరోనా ప్రభావం నుంచి నెమ్మదిగా బయటపడిన స్థిరాస్తి రంగం.. మళ్లీ మందగమనంలోకి వెళ్లనుందా? బడ్జెట్‌లో మోపిన పన్ను భారంతో క్రయవిక్రయాలు పడిపోనున్నాయా? ధరలు పెరిగి సామాన్యుల సొంతింటి కలలు చెదిరిపోతాయా?.. దేశీయ నిర్మాణ రంగాన్ని ఇప్పుడు కుదిపేస్తున్న ప్రశ్నలివే. అవును.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్.. రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీని ఒక్కసారిగా షాక్‌కు గురిచేసింది మరి.

**ఇదీ సంగతి..**

పార్లమెంట్‌లో ఈ నెల 23న (మంగళవారం) ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో స్థిరాస్తులు, ఇతర ఆర్థిక, ఆర్థికేతర ఆస్తుల అమ్మకాలపై ఇండెక్సేషన్ బెనిఫిట్స్‌ను తొలగిస్తున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగంపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఇప్పుడు మెజారిటీ ఇండస్ట్రీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ లేదా దీర్ఘకాల మూలధన లాభాలు) పన్నుకు ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తీసేస్తున్నట్టు విత్త మంత్రి వెల్లడించారు. అలాగే ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను 12.5 శాతానికి తగ్గిస్తున్నట్టూ చెప్పారు. ఇంతకుముందు ఇండెక్సేషన్ ప్రయోజనంతో 20 శాతంగా ఉండేదిది. అయితే గతంతో పోల్చితే పన్ను శాతం దాదాపు సగానికి తగ్గినా.. ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను దూరం చేయడం వల్ల స్థిరాస్తి అమ్మకందారులపై ట్యాక్స్ భారం ఇంకా పెరుగుతుండటమే ఇప్పుడు అందరి ఆందోళనకు కారణమవుతున్నది. ముఖ్యంగా రీ-సేల్ మార్కెట్ కుదేలవుతుందన్న అభిప్రాయాలున్నాయి.

**ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటే?**

2001 తర్వాత కొన్న ఇండ్లను ఇప్పుడు అమ్మితే.. కొనుగోలు చేసిన ధరపై వచ్చిన లాభానికి ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా ఎల్‌టీసీజీ పన్ను 12.5 శాతం వర్తిస్తుందని బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అయితే అంతకుముందు (2001 మార్చి 31 లోపు) కొన్న ఇండ్లను అమ్ముకుంటే మాత్రం ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుంది. ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ) నంబర్ల ఆధారంగా లెక్కిస్తారు. 2001-02 నుంచి (2001 ఏప్రిల్ నుంచి) ప్రతీ ఆర్థిక సంవత్సరం ఈ సీఐఐ నంబర్‌ను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ విడుదల చేస్తూ వస్తున్నది. 2001-02లో నాటి ద్రవ్యోల్బణం ఆధారంగా ఇది 100గా ఉన్నది. ఈ బేస్ రేటు (100)నే 2001 కంటే ముందు ఇండ్లు కొన్నవారికి ఇండెక్సేషన్ బెనిఫిట్ లెక్కింపునకు వాడుతున్నారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఇప్పటి ద్రవ్యోల్బణం రేటు ప్రకారం సీఐఐని 363గా నిర్ణయించారు. దీని ప్రకారం 2001-02 ఆర్థిక సంవత్సరంలో మీరు లక్ష రూపాయలకు ఇల్లు కొంటే.. ప్రస్తుతం దాని విలువ రూ.3.63 లక్షలు అన్నమాట. ఇంతకు మించిన ధరకు ఇల్లును మీరు అమ్ముకుంటే అందులో సదరు రూ.3.63 లక్షలుపోను మిగతా మొత్తానికే ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీన్నే ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటారు. అయితే ఇది పాత పన్ను ప్రకారం. తాజా బడ్జెట్‌లో చేసిన మార్పుల ప్రకారం ఇంటిని అమ్ముకున్న ధరలో నుంచి కొన్న ధర లక్ష మాత్రమే తీసేస్తారు. మిగతా మొత్తం అంతటికీ పన్ను పడుతుంది.




### పాత పన్ను ప్రకారం

2018-19లో రూ.50 లక్షలతో రాజేశ్ ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 280గా ఉన్నది. 2024-25లో రాజేశ్ ఆ ఇంటిని రూ.70 లక్షలకు అమ్మేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సీఐఐ 363గా ఉన్నది. దీంతో ఇంటిని అమ్మిన ఆర్థిక సంవత్సరం సీఐఐతో.. ఇంటిని కొన్న ఆర్థిక సంవత్సరం సీఐఐని భాగించడం జరుగుతుంది. 363/280=1.296428 వస్తుంది. దీన్ని ఇంటిని కొన్న ధర రూ.50 లక్షలతో గుణిస్తే.. రూ.64,82,142గా ఉంటుంది. ఇంటిని అమ్మడం ద్వారా వచ్చిన రూ.70 లక్షల్లో నుంచి ఈ రూ.64,82,142ను తీసేయాలి. అప్పుడు రూ.5,17,858 వస్తుంది. దీనిపై ఎల్‌టీసీజీ పన్ను 20 శాతం అంటే రూ.1,03,571.6 చెల్లిస్తే సరిపోతుంది.

### కొత్త పన్ను ప్రకారం

అమ్మిన ధర రూ.70 లక్షల నుంచి కొన్న ధర రూ.50 లక్షలను తీసేస్తే.. మిగిలే ఆ రూ.20 లక్షలపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలి. అంటే రూ.2.50 లక్షలు చెల్లించాలి. ఎల్‌టీసీజీకి ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తొలగించడం వల్ల గతంతో పోల్చితే ఇంటి అమ్మకంపై సుమారు రూ.1.47 లక్షలు అదనంగా ట్యాక్స్‌పేయర్లు చెల్లించాల్సి వస్తున్నదన్నమాట.

### ఇండస్ట్రీ వర్గాల ఆందోళనలివీ..

- ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తాజా బడ్జెట్‌లో తీసేయడం వల్ల రీసేల్ మార్కెట్ లావాదేవీలు మందగిస్తాయి.
- ఎప్పుడో కొన్న ఇండ్లు, భూములను ఇప్పుడు అమ్మేందుకు వాటి యజమానులు పన్ను భారం కారణంగా ఆసక్తి చూపరు.
- కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అమ్మకందారులకు పన్ను భారం పెరిగి లాభాలు తగ్గుతాయి.
- పన్నుల కారణంగా స్థిరాస్తి ధరలను అమ్మకందారులు అమాంతం పెంచేస్తారు. దీనివల్ల కొనుగోలుదారులు ముందుకురాని దుస్థితి నెలకొంటుంది.
- పన్నుల్ని తప్పించుకోవడానికి నగదు లావాదేవీలనే అంతా ఎంచుకుంటారు. ఇది ప్రభుత్వ ఖాజానాకు, నిర్మాణ రంగానికి కూడా నష్టం.
- కొత్త పెట్టుబడులు రాక నిర్మాణ ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయే ప్రమాదం.
- ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించడం వల్ల రియల్టీలోకి బ్లాక్‌మనీ రాక పెరుగుతుంది.

## మరో 1,000 తగ్గిన బంగారం ధర

- 3 రోజుల్లో రూ.5,000 పతనం
- హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు తులం రేటు



న్యూఢిల్లీ, జూలై 25: బంగారం ధరలు భారీగా దిగొస్తున్నాయి. గురువారం తులం రేటు మరో రూ.1,000కిపైగా పడిపోయింది. దీంతో 24 క్యారెట్ 10 గ్రాముల విలువ హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు చేరి రూ.69,820గా నమోదైంది. బుధవారంతో చూస్తే రూ.1,040 తగ్గింది. ఇక 22 క్యారెట్ రూ.950 దిగి రూ.64,000గా ఉన్నది. ఢిల్లీలో మాత్రం రూ.70,650 వద్ద స్థిరపడింది. ఇక్కడ అంతకుముందు రెండు రోజుల్లో రూ.4,000 దిగజారగా.. మొత్తం ఈ మూడు రోజుల్లో రూ.5,000 పతనం కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల క్షీణత, నగల వర్తకులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంబులియన్ మార్కెట్‌ను దిగువముఖం పట్టిస్తున్నాయి. మరోవైపు కిలో వెండి ధర కూడా ఢిల్లీలో రూ.3,500 తగ్గి రూ.84,000గా ఉన్నది. హైదరాబాద్‌లో రూ.84,500 పలుకుతున్నది. బడ్జెట్‌లో బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాలకు కోత పెట్టడంతో.. ఒక్కసారిగా బయ్యర్లు, ఇన్వెస్టర్లు రివర్స్‌గేర్ వేశారు. కాగా, గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు బంగారం 2361 డాలర్లు పలికితే.. వెండి 28.04 డాలర్లుగా నమోదైంది.


## ఐడీబీఐ అమ్మకానికి అంతా సిద్ధం

- త్వరలో ఆర్బీఐ నుంచి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, జూలై 25: ప్రభుత్వ రంగ సంస్థ, ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకు లైన్ క్లియరవుతున్నది. బ్యాంక్‌ను చేజిక్కించుకొనేందుకు వీలున్న మదుపరులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి కావాల్సిన భద్రతాపరమైన అనుమతులు వచ్చేశాయి. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. అలాగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి కూడా అనుమతి త్వరలోనే వస్తుందన్నారు. కాగా, ఐడీబీఐలో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ 30.24 శాతం, కేంద్ర ప్రభుత్వం 30.48 శాతం వాటాలను అమ్మేయనున్నాయి. ఈ బ్యాంక్‌లో కేంద్రానికి, ఎల్ఐసీకి కలిపి మొత్తం 94.72 శాతం వాటా ఉన్నది.

## కెనరా బ్యాంక్ లాభం 3,905 కోట్లు

**తొలి త్రైమాసికంలో 10 శాతం వృద్ధి**



న్యూఢిల్లీ, జూలై 25: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికపు నికర లాభంలో 10 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.3,535 కోట్లుగా ఉన్న నికర లాభం గత త్రైమాసికానికిగాను రూ.3,905 కోట్లకు ఎగబాకింది. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని బ్యాంక్ ఎండీ కే సత్యనారాయణ రాజు తెలిపారు. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.34,020 కోట్లకు చేరుకున్నట్లు చెప్పారు అలాగే మొండి బకాయిలపై యుద్ధం ప్రకటించినట్లు, ఇక నుంచి ప్రతి త్రైమాసికంలో రూ.1,000 కోట్ల బకాయిలను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.14 శాతానికి దిగొచ్చింది. అలాగే నికర ఎన్‌పీఏ కూడా 1.24 శాతానికి తగ్గింది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.8,500 కోట్ల నిధుల సేకరించనున్నది.

## జియో ఎయిర్ ఫైబర్ ఇన్‌స్టాలేషన్‌లో రాయితీ

న్యూఢిల్లీ, జూలై 25: ఎయిర్‌ఫైబర్ వినియోగదారులకు శుభవార్తను అందించింది జియో. వచ్చే నెల 15 వరకు ఇన్‌స్టాలేషన్ చార్జీలు రూ.1,000 రాయితీ ఇస్తున్నట్టు గురువారం ప్రకటించింది. అలాగే ఎంట్రీ-లెవల్ ప్లాన్లపై 30 శాతం వరకు రాయితీ ఇస్తున్నది. జూన్‌తో ముగిసిన మూడు నెలలకాలంలో దేశవ్యాప్తంగా 11 లక్షల మంది నూతన ఎయిర్‌ఫైబర్ కనెక్షన్లు మాత్రమే చేరారు. ఇతర పోటీ సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవాలనే ఉద్దేశంతో జియో ఈ నిర్ణయం తీసుకున్నది.

## ఐపీవోకి స్టాండర్డ్ గ్లాస్

హైదరాబాద్, జూలై 25: హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ స్టాక్ మార్కెట్లోకి లిస్ట్ కాబోతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్‌ను సమర్పించింది. ఐపీవో ద్వారా గరిష్ఠంగా రూ.600 కోట్ల వరకు నిధులు సమీకరించాలనుకుంటున్నది. దీంట్లో ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.250 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో మరో రూ.350 కోట్లను 1.84 కోట్ల షేర్లను జారీ చేయడం ద్వారా సేకరించాలనుకుంటున్నది.

## వెమ్ టెక్నాలజీస్ 1,000 కోట్ల పెట్టుబడి

- రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రక్షణ రంగ పరికరాల తయారీ సంస్థ వెమ్ టెక్నాలజీస్ మొదటి దశ ప్రాజెక్టులో భాగంగా రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. జహీరాబాద్ నిమ్జ్‌లో 511 ఎకరాల స్థలంలో ఏర్పాటవుతున్న ఈ సమీకృత ఉత్పాదన కేంద్రం వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి అందుబాటులోకి రానున్నది. కంపెనీకి కేటాయించిన భూమిలో ఇంకా స్వాధీనం చేయాల్సిన 43 ఎకరాలకు సంబంధించిన సమస్యను వెంటనే పూర్తి చేసి అందచేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు మంత్రి సూచించారు. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా విక్రయం ద్వారా రూ.50 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకోవడానికి మంత్రి తప్పుపట్టారు. ఇది కన్న బిడ్డలను మరొకరికి అమ్ముకోవడం లాంటిదన్నారు.

**మిత్సుయి కెమికల్స్ టెక్నికల్ సెంటర్**

జపాన్‌కు చెందిన మిత్సుయి కెమికల్స్.. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి టెక్నికల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నది. టీ హబ్ ద్వారా లైఫ్ సైన్సెస్, పెట్రో కెమికల్స్ రంగాల స్టార్టప్‌ల్లో రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు మిత్సుయి ప్రతినిధి హన్మంతరావు తెలిపారు.

## ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి

న్యూఢిల్లీ: చారిత్రక కనిష్ఠ స్థాయికి రూపాయి పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ 7 పైసలు తరిగిపోయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి 83.78కి జారుకున్నది. విదేశీ నిధులు తరలించుకుపోవడం, డాలర్‌కు డిమాండ్ పెరగడంతో మారకం విలువ నెల కనిష్ఠానికి జారింది. 83.72 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ రేటు ఇంట్రాడేలో 83.66 గరిష్ఠ స్థాయికి చేరుకున్నది.